ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం
# టీ-మీడియా
సామాజికం.. ప్రజల పక్షం...
సంపుటి : 22
సంచిక : 22
పేజీలు : 3
గురువారం, ఆగస్టు 21, 2025
GSTIN:36FDKPS1308P1ZX | Digital, tmedia.net.in
ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ

## పోలీస్ స్టేషన్ ఆవరణలో కలకలం

### మద్యం మత్తులో పురుగుమందు తాగడానికి ప్రయత్నం



**టీ మీడియా,ఆగస్టు20, సింగరేణి (కారేపల్లి):**కారేపల్లి పోలీస్ స్టేషన్ ఆవరణలో మంగళవారం మధ్యాహ్నం కలకలం రేగింది. మద్యం మత్తులో ఒక వ్యక్తి పురుగుమందు తాగడానికి యత్నించడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు.మండలంలోని విశ్వనాథపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని కారేపల్లి క్రాస్ రోడ్‌కు చెందిన పాలెపు వీరభద్రం మద్యం సేవించి పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకున్నాడు.అకస్మాత్తుగా తన దగ్గరున్న పురుగుమందు సీసా తెరిచి తాగడానికి ప్రయత్నించగా, పోలీసులు వెంటనే అడ్డుకొని సీసా స్వాధీనం చేసుకున్నారు.ఈ ఘటనపై స్పందించిన కారేపల్లి ఎస్సై బి.గోపి మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో ఇలాంటి న్యూసెన్స్ సృష్టించడం చట్టవిరుద్ధమన్నారు .మద్యం

మిగతా 3లో

# భద్రాచలం వద్ద డేంజర్? అలర్ట్?

**- మొదటి ప్రమాద హెచ్చరిక జారీ**

**- గోదావరి వద్ద 44.8 అడుగులకు చేరిన నీటిమట్టం**

**టి మీడియా, ఆగస్టు 20,భద్రాచలం :**

రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న వర్షాలతో పాటు ఎగువ నుంచి వస్తున్న వరద నీటితో భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం వేగంగా పెరుగుతోంది. ఇవాళ ఉదయం 8 గంటలకు 42.8 అడుగుల వద్ద ప్రవహించిన గోదావరి, ఉదయం 11 గంటలకు 44 అడుగుల వద్దకు చేరింది. ప్రస్తుతం మధ్యాహ్నం ఒంటి గంటకు 44.8 అడుగులకు ప్రవహిస్తోంది. దీంతో అధికారులు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. వరద నీరు భద్రాచలం కల్యాణకట్ట వరకు చేరింది. ఈ మేరకు అధికారులు నది వద్ద గజ ఈతగాళ్లు, లాంచీలు ఏర్పాటు చేశారు.మంగళవారం వరకు 36 అడుగుల వద్ద ప్రవహించిన గోదావరి నీటిమట్టం రాత్రి నుంచి వరద వేగంగా పెరుగుతూ 42 అడుగులకు చేరుకుంది. ఇవాళ(బుధవారం) ఉదయం 6 గంటలకు గోదావరి నీటిమట్టం 42.2 అడుగుల వద్ద ప్రవహించింది. అలాగే ఉదయం 8 గంటలకు 42.8 అడుగుల వద్దకు చేరి ప్రవహించగా, ఉదయం 9 గంటలకు 43 అడుగులకు చేరుకుంది. గోదావరి నీటిమట్టం 43 అడుగులు చేరడంతో మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. ఉదయం 10 గంటలకు 43.6 అడుగులకు నీటిమట్టం చేరింది. ఉదయం 11 గం.కు 44 అడుగులకు చేరుకుంది. దీంతో జిల్లా కలెక్టర్? జితేశ్? వి. పాటిల్? మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. ఇలా నీటిమట్టం పెరగడంతో స్నాన ఘట్టాల ప్రాంతం వద్ద చాలా వరకు మెట్లు, విద్యుత్? స్తంభాలు వరద నీటిలో మునిగిపోయాయి. వరద నీరు ఎక్కువ రావడంతో కల్యాణ కట్ట భవనం వరకు చేరింది. అలాగే మరోవైపు గోదావరి దిగువన ఉన్న శబరి ఉపనదికి వరద ప్రవాహం పెరుగుతోంది.పర్ణశాల వద్ద పెరిగిన నీటిమట్టం : దుమ్ముగూడెం మండలం పర్ణశాల వద్ద నీటిమట్టం పెరగడంతో నార చీరల ప్రాంతం వరదనీటిలో మునిగింది. చర్ల మండలంలోని తాలుపేరు జలాశయానికి ఎగువ ప్రాంతం నుంచి వరదనీరు వచ్చి చేరుతున్నాయి. ఈ ప్రాజెక్టు వద్ద 8 గేట్లను ఎత్తి అధికారులు 10 వేల క్యూసెక్కుల వరద నీటిని దిగువన ఉన్న గోదావరి నదిలోనికి విడుదల చేస్తున్నారు. గోదావరి నీటిమట్టం పెరుగుతుండటంతో మత్స్యకారులు గోదావరి పరివాహక ప్రాంతం వద్దకు చేపల వేటకు వెళ్లవద్దని అధికారులు సూచించారు.



**అత్యవసర సేవలకు కంట్రోల్ రూం ఏర్పాటు**

ప్రస్తుతం 9,32,288 క్యూసెక్యుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. గోదావరి నది పరిహహక ప్రాంతంలో నివసిస్తున్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ముంపు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలని అధికారులను ఆదేశించారు. వరద పరిస్థితులను జిల్లా యంత్రాంగం నిరంతరం పర్యవేక్షిస్తున్నదని, ఎటువంటి అత్యవసర పరిస్థితులు తలెత్తిన వెంటనే అవసరమైన చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. ప్రజలు రక్షణ చర్యల్లో సహకరించాలని, అధికారుల సూచనలను కచ్చితంగా పాటించాలని కలెక్టర్ కోరారు. అత్యవసర సేవలకు కంట్రోల్ రూమ్ నెంబర్లకు సంప్రదించాలని కలెక్టర్ పేర్కొన్నారు.కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద పెరుగుతున్న వరద : భూపాలపల్లిలో కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద వరద పెరుగుతోంది. ప్రస్తుతం 12.41 మీటర్ల మేర వరద ప్రవహిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న వర్షాల వల్ల ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో త్రివేణి సంగమం వద్ద వరద పోటెత్తింది. జ్ఞాన సరస్వతి, సాధారణ పుష్కర ఘాట్ల మెట్ల పైనుంచి వరద ప్రవాహం చేరింది. త్రివేణి సంగమం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక స్థాయిలో వరద ప్రవహిస్తుంది.





## రైళ్ళను పునరుద్ధరించాలి

### రైల్వే జీఎం కు ఎంపీ లేఖ

**టీ మీడియా,ఆగస్టు20, సింగరేణి (కారేపల్లి):**

కారేపల్లి జంక్షన్ మీదుగా భద్రాచలం రోడ్డు నుండి డోర్నకల్ జంక్షన్ మధ్యలో నడిచే రైళ్ళను పునరుద్ధరించాలని ఖమ్మం పార్లమెంటు సభ్యులు రామ సహాయం రఘురాం రెడ్డి రైల్వే జీఎం కు లేఖ రాశారు. కారేపల్లి కి చెందిన సామాజిక కార్యకర్త ఇందుర్తి సురేందర్ రెడ్డి ఇటీవల కారేపల్లి వచ్చిన ఎంపీ రఘురాంరెడ్డి కి రైల్వే సమస్యలను దృష్టికి తీసుకొచ్చారు. కరోనా సమయంలో డోర్నకల్ జంక్షన్ భద్రాచలం రోడ్డు మధ్యలో నడిచే రైళ్లను రైల్వే శాఖ రద్దు చేయగా కరోనా తర్వాత కాజీపేట మణుగూరు, డోర్నకల్ జంక్షన్ భద్రాచలం రోడ్డు మధ్యలో నడిచే రైళ్లను ఐదు సంవత్సరాలు పూర్తయినా నేటికి పునరుద్ధరించలేదని ఎంపీ రఘురాం రెడ్డి తెలిపారు. ప్రస్తుతం నడుస్తున్న మిగతా రైళ్లకు కూడా రైల్వే శాఖ పోచారం, గాంధీపురం, చీమలపాడు, తడికలపూడి, బేతంపూడి స్టేషన్ల లో హాల్టింగ్ తీసివేసిందని ఆ స్టేషన్లలో రైళ్ల హాల్టింగ్ ఇవ్వాలని సురేందర్ రెడ్డి ఎంపీకి వినతిపత్రం ఇచ్చారు. దీనిపై స్పందించిన ఎంపీ రఘురాం రెడ్డి రద్దు చేసిన రైళ్లను పునరుద్ధరించాలని, భద్రాచలం రోడ్డు డోర్నకల్ జంక్షన్ మధ్యలో ఉన్న అన్ని స్టేషన్లలో అన్ని రైళ్లకు హాల్టింగ్ కల్పించాలని రైల్వే జిఎంకు లేఖ రాశారు. మాదారం రోడ్డులో కారేపల్లి

మిగతా 3లో

## నిండుకుండలా కిన్నెరసాని జలాశయం..

**-రెండు గేట్లు ఎత్తి 10వేల క్యూసెక్కుల నీరు విడుదల**

**టి మీడియా, ఆగస్టు 20,పాల్వంచ(భద్రాద్రి కొత్తగూడెం):**

ఎగువన భారీ వర్షాలకు వస్తున్న వరదతో పాల్వంచ మండలంలోని కిన్నెరసాని జలాశయంనిండుకుండలా మారింది. పూర్తిస్థాయి నీటిమట్టం 407 అడుగులు కాగా.. మంగళవారం 404.60 అడుగులకు చేరింది. దీంతో రాత్రి రెండుగేట్లను ఎత్తి 10వేల క్యూసెక్కుల నీటిని దిగువ ప్రాంతాలకు విడుదలచేశారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో మహబూబాబాద్, పాకాల కొత్తగూడ నుంచి గుండాల అటవీ ప్రాంతాల మీదుగా ఇల్లెందుకొత్తగూడెం, టేకులపల్లినుంచి భారీగా వరద జలాశయానికి చేరుతోంది. దీంతో అధికారులు డ్యాం వద్దనే ఉంటూ తక్షణచర్యలు చేపట్టారు. లోతట్టు ప్రాంత ప్రజలకు హెచ్చరికలను జారీచేశారు. గేట్లను ఎత్తిన నేపథ్యంలో లోతట్టు ప్రజలు వాగులు దాటవద్దని హెచ్చరికలు చేశారు. రైతులు పరివాహక ప్రాంతంలో నాట్లు, పొలం పనులకు వెళ్లవద్దని తెలిపారు. గేట్లనుఎత్తడంతో పాల్వంచ, బూర్గంపాడు మండల అధికారులు అప్రమత్తమయ్యారు.



# ఆసుపత్రు లు నిబంధనలు పాటించాలి

**-జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**

**-రిజిస్ట్రేషన్ తప్పనిసరి**

**-అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు**




**టీ మీడియా,ఆగస్టు20,ఖమ్మం** :ప్రైవేట్ ఆసుపత్రుల నిర్వహణలో నిబంధనలు తప్పకుండా పాటించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. జిల్లా కలెక్టర్, కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ తో కలిసి ప్రైవేట్ డాక్టర్లు, ప్రైవేట్ హాస్పిటల్ మేనేజ్మెంట్ డైరెక్టర్ లకు బుధవారం ఏర్పాటు చేసిన అవగాహన, శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్నారు.జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూలి వైద్య రంగానికి సంబంధించి చట్టాల పట్ల ప్రైవేట్ ఆసుపత్రుల వారికి అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, హాస్పిటల్ మేనేజ్మెంట్ సిస్టం (హెచ్.ఎం. ఎస్.), వైద్య ఖర్చుల నియంత్రణ, పిసి పి.ఎన్.డి.టి., క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్, ఎంటిపీ యాక్ట్, ఐ.వి.ఎఫ్. సరోగసి నియమాలు పాటిస్తూ నాణ్యమైన సేవలు ప్రజలకు అందించాలనే ఉద్దేశ్యంతో సంబంధిత చట్టాలపై ట్రైనర్ల ద్వారా శిక్షణ అందిస్తున్నామని అన్నారు. మన వాహనాలకు ఏ విధంగా రిజిస్ట్రేషన్, లైసెన్స్ తీసుకుంటామో, అదే విధంగా ప్రైవేట్ ఆసుపత్రులు కూడా తప్పనిసరిగా వంద శాతం క్లినికల్ రిజిస్ట్రేషన్ యాక్ట్ క్రింద రిజిస్టర్ చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు.ప్రైవేటు ఆసుపత్రులు పాటించాల్సిన నిబంధనలు ప్రభుత్వం నిర్ణయిస్తుందని అన్నారు. ప్రతి ఆసుపత్రిలో వివిధ వైద్య సేవలకు వసూలు చేసే ఫీజుల వివరాలు, ధరల పట్టిక ప్రదర్శించాలని అన్నారు. నిరుపేదలకు ఎంపానెల్మెంట్ ఆసుపత్రులలో 10 లక్షల రూపాయల చికిత్స అందించాలని ప్రభుత్వం ఆరోగ్య శ్రీ పథకం అమలు చేస్తుందని, ఈ పథకం పట్ల అక్రమాలకు పాల్పడే వారి పట్ల కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు.ఒకే చికిత్సకు సీఎం రిలీఫ్ ఫండ్, ఆరోగ్య శ్రీ రెండు చోట్ల క్లెయిమ్స్ చేస్తున్నారని, ఈ పద్ధతి మారాలని అన్నారు. ఐ.వి.ఎఫ్ ఫర్టిలిటీ సెంటర్ నిర్వహణలో నిబంధనలు పాటించాలని అన్నారు. హైదరాబాద్ కేసులో టెస్ట్ ట్యూబ్ బేబి నుంచి మానవ రవాణా వరకు తప్పులు జరిగాయని, అటువంటివి నివారించేందుకు మనం నిబంధనలు పాటించాలని అన్నారు. ఫర్టిలిటి సెంటర్, ఐ.వి.ఎఫ్. క్లినిక్, జెనెటిక్ కౌన్సిలింగ్, నర్సింగ్ హొమ్, డయాగ్నొస్టిక్, స్పీచ్ థెరపీ వంటి అనేక రకాల ఆసుపత్రులు వస్తున్నాయని, వీరందరు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని అన్నారు. స్పీచ్ థెరపీ పేరుతో అధికంగా డబ్బులు వసూలు చేస్తున్నారని,

మిగతా 3లో



## సింగరేణి ఎంపీడీవోగా పి.శ్రీనివాస్

**టీ మీడియా,ఆగస్టు20, సింగరేణి (కారేపల్లి) :** సింగరేణి మండల ఎంపీడీవో గా పీ.శ్రీనివాస్ నియమితుల్కైనారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా డీఆర్‌డీవో కార్యాలయంలో పని చేస్తున్న పీ.శ్రీనివాస్ బదిలీపై సింగరేణి ఎంపీడీవో గా వచ్చారు. సింగరేణి ఎంపీడీవో కార్యాలయంలో ప్రస్తుతం ఇంచార్జ్ ఎంపీడీవో అయిన ఎంపీవో మల్లెల రవీంద్రప్రసాద్ నుండి బుధవారం బాధ్యతలు స్వీకరించారు.ఎంపీడీవో శ్రీనివాస్‌కు కార్యాలయం అధికారులు, సిబ్బంది స్వాగతం ఫలికారు. ఈసందర్భంగా నూతన ఎంపీడీవో మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల అమలు, సంక్షేమ కార్యక్రమాలు సమర్ధవంతంగా ప్రజలకు చేరేలా కృషి చేస్తానన్నారు. సిబ్బంది, ప్రజాప్రతినిధుల సహకారం, సమన్వయంతో ముందుకు సాగుతానన్నారు.





## అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

**ఏడిఏ స్వర్ణ విజయ్ చంద్ర**

**టీ మీడియా,ఆగస్టు20,బోనకల్లు:** ఎరువులను ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే విక్రయించాలని, అధిక ధరలకు విక్రయించే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని మధిర ఏడిఏ స్వర్ణ విజయ్ చంద్ర అన్నారు. బోనకల్లు మండలంలోని బోనకల్లు, రావినూతల, ముష్టికుంట్ల గ్రామాల్లోని సహకార సంఘాల ఎరువుల దుకాణాలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఎరువుల దుకాణాల్లోని నిల్వలను, స్టాక్ రిజిస్టర్లను, సేల్ రిజిస్టర్లను, బిల్ బుక్కులను, పాస్ మిషన్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎరువుల కృత్రిమ కొరతను సృష్టించకుండా రైతులకు సరిపడా ఎరువులను అందించాలన్నారు.రైతులకు సరిపడా ఎరువులు అందుబాటులో ఉన్నాయని, ఎవరు కూడా ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు రైతులు యూరియాను అవసరం మేరకు మాత్రమే కొనుగోలు చేయాలని, అలాగే యూరియాను ఒకేసారి కాకుండా దఫ దఫాలుగా వినియోగించడం ద్వారా మంచి ఫలితాలు పొందవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ పసునూరి వినయ్ కుమార్, ఏఈఓ గోగుల హరికృష్ణ పాల్గొన్నారు.

## సిద్ధాంత నిబద్ధకు కట్టుబడిన పుల్లయ్య

**-సంస్మరణ సభ లో వక్తలు**

**టీ మీడియా,ఆగస్టు20, సింగరేణి (కారేపల్లి)**

: సిద్ధాంత నిబద్ధకు కటుబడిన కార్యకర్తల పోతురాజు పుల్లయ్య అని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు దుగ్గి కృష్ణ, కొండబోయిన నాగేశ్వరరావు, మెరుగు సత్యనారాయణ లు అన్నారు. కారేపల్లి మండలం ఉసిరికాయలపల్లి చెందిన సిపిఐ(ఎం) సీనియర్ కార్యకర్త పోతురాజు పుల్లయ్య సంస్మరణ కార్యక్రమం బుధవారం జరిగింది. అమరజీవి పోతురాజు పుల్లయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించిన నేతలు మాట్లాడుతూ ఉసిరికాయలపల్లి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం, భూస్వామ్యుల వ్యతిరేక పోరాటాలకు ఉద్యమగడ్డ గా ఉందన్నారు. ఉసిరికాయలపల్లి ప్రాంతంలో భూస్వాములను నెదిరించిన పోరాడిన వారిలో పోతురాజు కుటుంబం ముందుందన్నారు. నమ్మిన సిద్ధాంతం కోసం పోతురాజు పుల్లయ్య కడవరకు పోరాడారని ఆయన మృతి కుటుంబానికే కాక పార్టీకి కూడా తీరని లోటన్నారు. పుల్లయ్య ఆశయ సాధనకు ఈ ప్రాంత కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. పుల్లయ్య తండ్రి కోటయ్య, భార్య దేవి, ఇద్దరు కుమారులకు సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు మెరుగు రమణ, మండల కార్యదర్శి కే.నరేంద్ర, డివిజన్ కమిటీ సభ్యులు వజ్జా రామారావు, కొండబోయిన ఉమావతి, బానోత్ బన్సీలాల్, నాయకులు దాసరి మల్లయ్య, తేజావత్ చందర్, దాసరి సైదులు, ఎల్లావుల రాములు, పచ్చిపాల రమేష్, నరసయ్య, వెంకన్న, శ్రీను, తిరపయ్య, వీరు, కాంగ్రెస్ నాయకులు గడ్డం వెంకటేశ్వర్లు టిఆర్ఎస్ నాయకులు జాల సాంబ తదితరులు పాల్గొన్నారు.



# నిలిచిపోయి పారిశుధ్య పారిశుధ్యం

**- నిధులు లేవు అంటున్న అధికారులు**

**-నున్నా నాగేశ్వరరావు**

**టీ మీడియా, ఆగస్టు 20 ,కొణిజర్ల :** స్పెషలాఫీసర్ల పరిపాలనలో గ్రామ పంచాయతీలు చెత్తకుప్పలుగా మారాయి నున్నా నాగేశ్వరరావు విమర్శించారు. బుధవారం చింతపల్లి ప్రసాద్ అధ్యక్షతన భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్) నిర్వహించిన జనరల్ బాడీ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న నున్నా నాగేశ్వరరావు ప్రసంగించారు.ఇటీవల కాలంలో కురిసినటువంటి అధిక వర్షాలు వలన దోమలు విపరీతంగా పెరిగిపోయి ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. అయినా అధికారులు ఏమాత్రం పట్టించుకోవటం లేదు అని. గ్రామపంచాయతీ కార్యాలయాల్లో నిధులు లేనటువంటి నెపంతో గ్రామాల్లో వీధిలైట్లు వేయించడం, డ్రైనేజీలు శుభ్రపరచడం, బ్లీచింగ్ చల్లడం గానీ దోమల నియంత్రణ కొరకు పాగింగ్ చేయడం వంటి కనీసమైనటు వంటి కార్యక్రమాలు చేపట్టడం లేదు అని. మండలంలో డెంగ్యూ వ్యాధి లక్షణాలతో సుమారు ఇప్పటికే ఐదుగురు చనిపోవడం జరిగింది అని. ఇప్పటికైనా అధికారులు అప్రమత్తమై గ్రామాల్లో పారిశుధ్యం మెరుగు పరచడం కొరకు విస్తృతమైనటువంటి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. యూరియా బస్తాల కోసం సొసైటీల ముందు రోజులు తరబడి కాపలా కాయాల్సిన పరిస్థితి ఏర్పడింది అని అన్నారు. ఈ సమస్యల పట్ల తక్షణమే అధికారులు స్పందించి పరిష్కరించాలని కోరేరు. ఈ సమావేశంలో సిపిఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు తాళ్లపల్లి కృష్ణ , పార్టీ మండల కార్యదర్శి చెరుకుమల్లి కుటుంబరావు,కొప్పుల కృష్ణయ్య , బోయినపల్లి శ్రీనివాసరావు, మోతుక్కూరు వెంకటేశ్వరరావు, జోనబోయిన అంజయ్య, తాళ్లపల్లి విజయ, తదితరులు పాల్గొన్నారు.

## లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**టి మీడియా, ఆగస్టు 20,పినపాక ప్రతినిధి:** ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరి వరదలు పెరుగడంతో, బుధవారం మధ్యాహ్నం భద్రాచలం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసినందున అశ్వాపురం మండలంలోని గోదావరి పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సిఐ జి అశోక్ రెడ్డి సూచించారు. పాములపల్లి, అమ్మగారిపల్లి, చింతిర్యాల, ఆనందాపురం, నెల్లిపాక బంజర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఏదైనా సమస్య ఉంటే వెంటనే 100కి కాల్ చెయ్యాలని,తక్షణమే పోలీసులు చర్యలు తీసుకుంటారని తెలిపారు.




## రైళ్ళను పునరుద్ధరించాలి

నుండి ఇల్లందు, గాంధీపురం వద్ద గల గేట్ల వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జిలు నిర్మించాలని, భద్రాచలం రోడ్డు నుండి తిరుపతి కి ప్రతిరోజు ఎక్స్ ప్రెస్ రైలు నడపాలని కోరుతూ రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ ను కలుస్తానని ఎంపీ తెలిపారని సామాజిక కార్యకర్త సురేందర్ రెడ్డి తెలిపారు. రైల్వే సమస్యలపై స్పందించిన ఎంపీ కి సామాజిక కార్యకర్త ఇందుర్తి సురేందర్ రెడ్డి కృతజ్ఞులు తెలిపారు.

## ఆసుపత్రు లు నిబంధనలు పాటించాలి

అక్కడ క్వాలిఫైడ్ వైద్యులు ఉన్నారా వంటి అంశాలు పరిశీలన చాలా అవసరమని అన్నారు. ప్రైవేట్ ఆసుపత్రులు తప్పనిసరిగా పార్కింగ్ సౌకర్యం, అగ్ని ప్రమాదాల నివారణకు వాహనాలు వచ్చేలా ఫైర్ క్లియరెన్స్ ఉండాలని అన్నారు. హైదరాబాద్ లో ఓల్డ్ సిటీ లో అగ్ని ప్రమాదం కారణంగా ఒక ఇంట్లో మూడు తరాలకు చెందిన ప్రజలు మరణించారని, ఫైర్ సేఫ్టీ నిబంధనలను ఆసుపత్రులు తప్పనిసరిగా పాటించాలని, ఇందులో ఎటువంటి సడలింపు ఇవ్వడం కుదరదని కలెక్టర్ స్పష్టం చేశారు. డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్యా వంటి సీజనల్ వ్యాధులు, టీబీ నియంత్రణలో ప్రైవేటు ఆసుపత్రులు తమ సహకారం అందిస్తున్నారని అన్నారు. ఆరోగ్యకరమైన ఖమ్మం జిల్లాను తయారు చేయడంలో ప్రైవేట్ ఆసుపత్రులు తమ సహకారం అందించాలని అన్నారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ మాట్లాడుతూలి జిల్లాలో ఉన్న ప్రైవేట్ ఆస్పత్రులు క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్, పి.సి.పి.ఎన్.డి.టి, ఇతర చట్టాలపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ఐ.ఎం.ఏ. జిల్లా అధ్యక్షులు డాక్టర్ కంభంపాటి నారాయణ మాట్లాడుతూలి ప్రైవేట్ ఆసుపత్రులు ట్రేడ్ లైసెన్స్ ఫీజు చెల్లింపుపై హై కోర్టు స్టే ఇచ్చిందని, దీనిని మున్సిపాలిటీ లలో అమలు అయ్యేలా చూడాలని అన్నారు. చిన్న ఆసుపత్రులకు ఫైర్ సేఫ్టీ అంశంలో కొంత సడలింపు ఇవ్వాలని అన్నారు. అనంతరం ప్రైవేటు ఆస్పత్రుల నిర్వహణ పట్ల ప్రైవేట్ వైద్యులు అందించిన సూచనలు, సలహాలను కలెక్టర్ తెలుసుకున్నారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిణి డా. బి. కళావతి బాయి, డి.సి.హెచ్.ఎస్. డాక్టర్ రాజశేఖర్ గౌడ్, ప్రోగ్రాం ఆఫీసర్లు డా. చందు నాయక్, డా. వెంకట రమణ, డిప్యూటీ డిఎంహెచ్ఓ., స్టేట్ టి.ఓ.టి. లు డా. కల్పన తోరన్, ఎస్.ఎం.ఓ. డా. మురారి రాజేంద్రప్రసాద్, డాక్టర్ నారాయణ మూర్తి, ప్రభుత్వ, ప్రైవేట్ గైనకాలాజిస్టులు, రేడియోలజిస్టులు, డాక్టర్లు, హాస్పటల్ మేనేజింగ్ డైరెక్టర్లు, డెమో సుబ్రహ్మణ్యం, స్టాటస్టికల్ ఆఫీసర్ నవీన్ కుమార్, డిపిఎం. దుర్గ, హెల్త్ ఎడుకేటర్ అన్వర్, డిడిఎం. నాగరాజు, డిఎస్ఓ వేణు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ స్టేషన్ ఆవరణలో కలకలం

మత్తులో వచ్చి పోలీసులను ఇబ్బంది పెట్టినా, చట్టాన్ని అతిక్రమించే చర్యలకు పాల్పడినా కఠినంగా వ్యవహరిస్తామన్నారు. ఎవరైనా మద్యం సేవించి స్టేషన్‌కు వస్తే కఠిన చర్యలు తప్పవు అని హెచ్చరించారు. ప్రస్తుతం వీరభద్రంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. %---%

## ఎరువుల దుకాణాలపై కేసులు

**టి మీడియా, ఆగస్టు 20,ఖమ్మం :** జిల్లా పోలీసులు ఐదు ఎరువుల దుకాణాలపై కేసులు నమోదు చేశారు. అంతేకాదు ఆయా దుకాణాల ట్రేడ్ లైసెన్సులను రద్దు చేయాలని కూడా వ్యవసాయ శాఖకు జిల్లా పోలీసు శాఖ సిఫారసు చేసింది. రైతుల యూరియా అవసరాన్ని ఆసరాగా చేసుకొని కొంతమంది ఎరువుల దుకాణదారులు యూరియా కావాలంటే ఇతర ఎరువులు లేదా పురుగుల మందు డబ్బాలు కొనుగోలు చేయాలని రైతులకు షరతులు పెడుతున్నారని ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తెలిపారు. ఈ విధంగా షరతులు పెడుతున్న ఐదు ఎరువుల దుకాణాలపై టాస్క్ ఫోర్స్ పోలీసులు ఆకస్మికంగా దాడులు చేసి కేసులు నమోదు చేశారని ఆయన చెప్పారు.రైతులకు నాణ్యమైన విత్తనాలు అందేలా పకడ్బందీ చర్యలు తీసుకోవడంలో భాగంగా ఏర్పాటు చేసిన టాస్క్ ఫోర్స్ పోలీసులకు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు నేలకొండపల్లి, చింతకాని, రఘునాథపాలెం, సత్తుపల్లి మండలలోని ఎరువుల దుకాణాలలో బుధవారం ఆకస్మికంగా సోదాలు నిర్వహించినట్లు సీపీ చెప్పారు. రైతులకు యూరియాతో పాటు ఇతర బయోస్టిమ్యులెంట్ ట్యాగ్ చేసి యూరియాను విక్రయిస్తున్నట్లు గుర్తించారని తెలిపారు. వారి ట్రేడ్ లైసెన్స్ రద్దు చేయాలని వ్యవసాయ శాఖకు సిఫార్సు చేసినట్లు పోలీస్ కమిషనర్ తెలిపారు.రైతుల అవసరాన్ని ఆసరాగా చేసుకొని అవసరం లేకున్నా యూరియాతో పాటు ఇతర ఎరువులు, పురుగు మందు డబ్బాలు బలవంతంగా అంటగట్టి, వ్యాపార లాభాల కోసం రైతులకు ఆర్థిక భారం మోపుతున్నారని సీపీ పేర్కొన్నారు. రైతులు సైతం యూరియా కొనుగోలు సమయంలో దుకాణదారులు ఏవైనా షరతులు పెడితే స్థానిక పోలీసులకు, వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఈ సందర్భంగా సూచించారు.

